అన్నీ ఒక్క తప్పుతో.. ఒక్క రోజుతో తల్లకిందులైనయి.

పిల్ల – పిల్లగాన్ని తోల్కపోయే వేళవుతున్నా.. మల్లేశు ఇంకా రాలేదని నాగమ్మకు గుబులు వట్టుకుంది. మరిది కొడుకు రాజుగాణ్ని పిలిచి దొరింటికి పంపింది.

అక్కడికి పోయిన రాజుగాడు.. వొగుర్చుకుంట తిరిగొచ్చి, అక్కడ చూసిన దారుణాన్ని రొప్పుతూ చెప్పిండు.

''కొడుకో మల్లేసూ!'' అంటూ గుండె బాదుకుంటూ పరిగెత్తింది నాగమ్మ. ఎనకే తిరుపతయ్య. ఒంటి మీద గుడ్డలు లేకుండా, ఎండలో పండుకొని ఏడుస్తున్న కొడుకును చూసి తల్లి గుండె తల్లడిల్లిపోయింది. చిన్నదొర ముంగట సాగిలవడ్డది.

''బాంచెన్ కాల్మొక్త! ఆడ్ని ఇడ్సిపెట్టుండ్రి.. నా కొడుకును మాఫ్ జెయ్యుండ్రి దొరా!'' అంటూ ఏడుస్తూ దండం పెట్టింది.

''ఆడు సిన్న తప్పు సెయ్యలే! చిన్నమ్మ తానం సేస్తుంటే చూసిండు. మాయమ్మ సూడకుంటె ఇంకేటి సేసేటోడో!'' అని కోపంతో తన్నిండు జగన్నాథం.

''సిన్న పోరడు దొరా! నాదే తప్పు.. దొర ఇనాం ఇత్తనంటే పోరగాన్ని పంపిన. ఇడ్సి పెట్టుండ్రి. ఇంట్ల పెండ్లి ఆగిపోద్ది దొరా!''..

ఎంత ప్రాధేయపడినా.. ఇడ్సిపెట్టరని తిరుపతయ్యకు తెల్సు. కోపాన్ని, దుఃఖాన్ని దిగమింగుకుంటూ పెళ్లాన్ని బైటికి తీసుకొచ్చి, గడీ గోడకు చతికిలపడ్డడు. సూరీడు కిందికి జారుతుండంగా.. మల్లేశును బంధ విముక్తుణ్ని చేసి, గుమ్మం బైటికి గెంటించిండు చిన్న దొర.

నాగమ్మ గుడ్డలు తెచ్చి తొడిగింది. తిరుపతయ్య కొడుకుని జాగర్తగా ఇంటికి మోసుకుంట తీసుకొచ్చిండు.

అప్పటికే పెండ్లి మూర్తం దాటిపోయింది. వొచ్చిన పిలగాడి తరుపోళ్లు, సుట్టాలు, కులపోళ్లంతా వెళ్లిపోయిండ్రు.

ఆ రాత్రి మందుబిళ్లలు కొనుక్కొచ్చి మల్లేశుకు వేసిండు తిరుపతయ్య.

''ఇయ్యన్నీ మనకు కొత్తేంకాదుగదా బిడ్డా! దిగులెట్టుకోకు. ఈడ పది సదివినంక ఏడికోకాడికి పోదువు. నీకెట్లన్న కొలువొత్తదని పంతులయ్య సెప్పిండు. మంచిగ తిని పండుకో! నాల్గు దినాలు ఇస్కూలుకు పోవొద్దులే!'' అంటూ చాలాసేపు సముదాయించిండు తిరుపతయ్య.

''ఊ!'' కొట్టిండు మల్లేశు.

రెండు దినాలు ఏదో ఆలోచిస్తా మంచిగనే ఉన్నడని అనుకున్నరు అంతా! మూడో రోజున సూరీడు నడినెత్తి మీదికి వచ్చేయాల్లకు..

'ఎవలో వాగుల దుంకిండ్రంట!' అంటూ అందరూ పరిగెత్తుతుంటే.. నాగమ్మ కూడా పరిగెత్తింది.

అప్పటికే ఈత వచ్చినోళ్లు మల్లేశును పైకి తీసుకొచ్చిండ్రు. ప్రాణం పోయిందని చెప్పిండ్రు.

నాగమ్మ గుండె పగిలి కూలబడ్డది.

తిరుపతయ్య పరిగెత్తుకొచ్చిండు. కొడుకు శవాన్ని చూస్తున్నా.. ఏడుపు రావడంలేదు. కోపం మాత్రం లావాలా పొంగుకుంటూ వస్తున్నది. కానీ, అది గుండెలోనే ఆగిపోతున్నది. అందరూ కలిసి మల్లేశును మట్టి చేసిండ్రు. పది బింకీల కల్లుతెచ్చి కులపోళ్లకు తాగిపిచ్చిండు తిరుపతయ్య. పెండ్లయినా, చావయినా.. కర్సే!

కొడుకును తల్సుకుంట అన్నీ మానేసింది నాగమ్మ. పిచ్చిదానిలా వాగుకాడికి పరిగెత్తేది. కలవరించేది. బిడ్డ పెండ్లి చూడకుండనే కాటికి ఎళ్లిపోయింది. తిరుపతయ్య జీవితంలో చీకటి నింపేసి.. కాలం మాత్రం తన దారిన తాను పోతానే ఉన్నది.

కొన్నొద్దులకు ఆగిపోయిన బిడ్డ పెండ్లి జరిపించిండు. అల్లుడు నారాయణ మంచోడు. మామతోనే ఉంటన్నడు. రోజులు గడుస్తనే ఉన్నయి.

* * *

పెండ్లయిన ఆరేండ్లకు మాలచ్మికి బిడ్డ పుట్టింది. 'నాగమణి' అని తల్లిపేరు పెట్టుకున్నది. మల్ల మూడేండ్లకు కొడుకు పుట్టిండు. 'మల్లేశు' అని పేరెట్టింది.

పిల్లలు కొంచెం పెద్దగైనంక.. ఇద్దర్నీ గురుకుల పాఠశాలలో చేర్పించి వచ్చిండు తిరుపతయ్య.

ఆరోజు తండ్రితోని పెద్ద లొల్లే పెట్టుకున్నది మాలచ్మి.

''మల్లేసుకు బట్టలేసుకునుడు గూడ రాదాయె! బిడ్డనేమో ఆకలి అని గూడ అడ్గదాయె! నా పిల్లల్ను సంపుతవా ఏంది? పోరగాండ్లను నా కండ్ల ముంగట లేకుండ జేసినవ్!'' అని కోపం తెచ్చుకున్నది.

''నా మాటిను బిడ్డా! మనలెక్క పందుల్ని కాసుకుంట.. పంది పెంట ఏరుకుంట ఆళ్లు బతుకద్దు బిడ్డా! మంచిగ సదువుకోవాలె. పెద్ద కొలువులు సెయ్యాలె. దొరల ముంగల తలెత్తుకొని బతకాలె. గా రోజు సూసినంకనే.. మీ అమ్మతానికి వోత బిడ్డా!'' అంటూ కండ్ల నీళ్లు పెట్టుకున్నడు తిరుపతయ్య.

* * *

''అమ్మా – నాయ్న యాదికొస్తున్నరు తాతా!'' అని పిల్లలు అన్నప్పుడల్లా.. తిరుపతయ్య ఒక్కటే చెప్పేటోడు.

''బిడ్డా నాగమణీ! తమ్మునికి నువ్వే అన్నీ నేర్పియ్యాలె. మీరు మంచిగ సదువాలె. ఇక్కడైతే.. అన్నీ సర్కారోళ్లే సూస్కుంటరు. మీరుగూడ ఈ పంతుళ్ల లెక్క కొలువులు సెయ్యాలె. మాతాన ఉంటె.. మా లెక్కనే బత్కాలె బిడ్డా! అక్కడుంటె.. పెద్దోళ్లు ఎట్లనన్న ఎన్కకు గుంజుతరు. ఏకలవ్యుడంటె ఎర్కేనా బిడ్డా! మన ఎరుకల కులంలనే బుట్టిండట. మంచిగ బాణమేసే ఇద్దె నేర్సిండట. గుర్వులెక్క అచ్చినాయినె.. బొట్నేలు ఇయ్యిమని అడిగిండట. గప్పుడు సప్పుడు జెయ్యకుండ బొట్నేలు కోసి ఇచ్చేసిండట ఏకలవ్యుడు. అటెన్క అడవిల్నే ఉండిపోయిండట. గట్ల మనల్ని గూడ ఎద్గనియ్యరు బిడ్డా! సదువు దీపం లెక్క.. ఒక్క సిన్న దీపమైనా, అందర్కీ ఎలుగునిస్తది!''

తాత మాటలు వింటుంటే నాగమణికి మస్తు సంబురమయ్యేది. తమ్మునికి కూడా అన్నీ చెప్పేది.

''నేను టీచర్నయిత తాతా!'' అనేటోడు మల్లేశు.

కాలం ఎవరి కోసం ఆగదు.. అన్నట్టు పరిగెత్తి పోతూ ఉన్నది. ఒక్కో మెట్టూ ఎక్కినట్టు ఒక్కో క్లాసు పైకెక్కుతున్నరు పిల్లలిద్దరూ. తిరుపతయ్యను ఆదర్శంగా తీసుకొని ఎరుకులగూడెంలో చాలామంది తమ పిల్లల్ని గురుకుల హాస్టల్లో చేర్పించి, చదివించడం మొదలుపెట్టిండ్రు.

నాగమణి పదో క్లాసులో జిల్లాలోనే మూడో స్థానంలో నిలిచింది. వరంగల్లు గవర్నమెంటు కాలేజీల చేరింది.

'సంపాదించే ప్రతిపైసా పిల్లల సదువు కోసమే దాసిపెట్టాలె!' అంటడు తిరుపతయ్య.

''సాల్లే నాయ్నా! పోరికి పెండ్లి సెయ్యవా!? ఒపూట తినీ తినక ఆళ్ల కోసమే ఆలోచిస్తున్నవు. పైసలన్ని ఆళ్ల సదువుల కోసమే జమేస్తున్నవు. ఏనాడు సెటాకు పండ్లన్నా తిన్కపోతివి!'' అంటూ మాలచ్మి చీవాట్లేసింది.

''సద్వుకోనీ బిడ్డా! నిన్నేమో సదివియ్యలే! తమ్ముడేమో ఆగమైపోయిండు. మన బతుకుల్ల సీకటి నింపేసిండు. ఈళ్లనైన మంచిగ సద్వనీ''..

మాట్లాడుకుంటనే నిద్రపోయిండు తిరుపతయ్య.

ఇంటర్‌తో ఆగలేదు నాగమణి. డిగ్రీ పూర్తిచేసి.. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యింది. ఆ అమ్మాయి తెలివికి, చదువులో చూపిస్తున్న పట్టుదలకూ మెచ్చిన ఎంతోమంది.. వెనకుండి ప్రోత్సహించిండ్రు. ప్రిలిమ్స్‌లో పాసైంది. మెయిన్స్ కోసం ఇంకా కష్టపడ్డది. చివరికి ఇంటర్వ్యూలోనూ నెగ్గింది. ఐఏఎస్‌గా సెలెక్ట్ అయ్యింది. అప్పటికి మల్లేశు కూడా టీచర్ పోస్టులో చేరిపోయిండు.

పుట్టినప్పటినుంచీ ఎన్నెన్నో కష్టాలు, నష్టాలు, కన్నీళ్లు, అవమానాలు, ఛీత్కారాలు, పస్తులు.. ఎన్నిటినో దాటుకుంటూ నడుము వొంగిపోయిన తిరుపతయ్య, ఎనభై ఏండ్లకు దగ్గరయ్యిండు.

నాగమణి తన సొంత జిల్లాకే కలెక్టర్‌గా వెళ్లాలని పోస్టింగ్ సమయంలో కోరుకున్నది. నాగమణి ఫొటోతో పాటు పొగడ్తలతో ఆమె గురించి.. అన్ని పేపర్లు రాశాయి. మనవరాలి ఫొటో పేపర్లో చూసి.. కండ్లు మసకబారాయి తిరుపతయ్యకు.

* * *

రంగు కాయితాల దండలు, స్వాగత తోరణాలతో ఎరుకులగూడెంలో పండుగ వాతావరణం నెలకొన్నది. నాగమణి ప్రభుత్వ వాహనంలో ఊళ్లోకి రాగానే.. డప్పు చప్పుళ్లు మొదలైనయి. పోరగాళ్లంతా తీన్మార్ డ్యాన్సులు వేస్తుంటే.. తిరుపతయ్య కూడా చిందేసిండు. మాలచ్మి బిడ్డ నెత్తి చుట్టూ ఉప్పు, మిరపకాయల్తో దిష్టితీసి పారేసింది. బిడ్డ ఎంతో ఎత్తుకు ఎదిగిందని నారాయణ కండ్ల నీళ్లు తెచ్చుకున్నడు. నాగమణి తాత గుండెల్ల ఒదిగిపోయింది. మన్మరాలు నోరు తీపి చేసిండు తిరుపతయ్య.

''తాతా! సదువు దీపం లెక్కన అని చెప్పేటోనివి. నీ ఆశ తీరుతుందిలే! ఈ జిల్లా మంచిగ అయ్యేటట్టు చూస్తా! రాష్ట్రంలనే మంచి జిల్లాగా పేరొచ్చేటట్టు చేస్తా!'' అని నాగమణి అంటుంటే.. అక్కడున్నోళ్లంతా చప్పట్లు కొట్టిండ్రు.

''నా బిడ్డ నాయ్నా! ఎంత పెద్దదాన్ని సేసినవ్ నాయ్నా!'' అంటూ తండ్రి కాళ్లకు మొక్కి, కన్నీళ్లతో అభిషేకం చేసింది మాలచ్మి.

తిరుపతయ్య కండ్ల ముంగట రేపటి వెలుగు కనిపిస్తున్నది. తిరుపతయ్యను చూసి.. కాశీబుగ్గ ఊరుక్కూడా సంబురమైంది. ■

## జాస్తి రమాదేవి



అట్టడుగువర్గాల దీనగాథల్ని కథలుగా మలుస్తారు రచయిత్రి జాస్తి రమాదేవి. తూర్పుగోదావరి జిల్లా ములకల్లంక వీరి స్వగ్రామం. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువులో నివాసం ఉంటున్నారు. తల్లిదండ్రులు మునునూరి రత్నాంబ – రామారావు. ఇప్పటి వరకూ వివిధ పత్రికల్లో 150 వరకూ కథలు, 30 వరకు కవితలు, వివిధ అంశాలపై 20 వ్యాసాలు ప్రచురితమయ్యాయి. వివిధ సాహితీసంస్థలు, దిన–వార పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో 40 కథలు బహుమతులు దక్కించుకున్నాయి. తనువు సుమధనువు, చిగురంత ఆశ, నాన్న అంతే!, జీవన పోరాటం, కొత్త చిగురు, మట్టి కథలు పాఠకుల మన్ననలు పొందాయి. మొదటగా పత్రికలో అచ్చు అయిన కథ.. 'భారమైన బంధాలు'. ఆంధ్రజ్యోతి దీపావళి కథల పోటీలో బహుమతి దక్కించుకున్నది. తన చిన్నతనం నుంచి గమనించిన కొన్ని సంఘటలను స్ఫూర్తిగా తీసుకొని, 'వేగుచుక్క' కథ రాసినట్లు రచయిత్రి చెబుతున్నారు. ''చదువు అనేది వెనుకబడిన కులాల జీవితాల్లో ఎలా వెలుగు తీసుకొస్తుందో చెప్పేదే.. ఈ కథ లక్ష్యం'' అంటున్నారు.